ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
సోమవారం 30 సెప్టెంబరు 2024

శాకాహారం.. మెరుగైన జీవనం - రేపు ప్రపంచ శాకాహార దినోత్సవం 8

ప్రాణం తీసిన ఆస్తి పంచాయితీ - మొదటి భార్య పిల్లల దాడిలో తండ్రి మృతి 7

పల్లె లెక్క తేలింది

- పంచాయతీ ఓటరు తుది జాబితా విడుదల
- గత ఎన్నికల కంటే 33,765 ఓటర్ల పెరుగుదల
- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం



జాబితాలను పరిశీలిస్తున్న ఓటర్లు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పల్లె పోరుకు ఓటరు జాబితా కసరత్తు పూర్తి చేశారు. తుది ఓటరు జాబితా వెల్లడైంది. ఈ నెల 13న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసి గ్రామ పంచాయతీల వారీగా అభ్యంతరాలను స్వీకరించారు. శనివారం సాయంత్రం పంచాయతీ అధికారులు తుది జాబితాను విడుదల చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు, 2268 వార్డులకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాపై ఈ నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. పార్టీలు, ఓటర్ల నుంచి వచ్చిన 1065 అభ్యంతరాలను పరిష్కరించారు. తుది ఓటరు జాబితా వెల్లడించారు.

● పల్లె ఓటర్లు 3.46 లక్షలు

జిల్లాలో 12 మండలాలు, 260 గ్రామ పంచాయతీల పరిధిలో 3 లక్షల 46 వేల 259 ఓటర్లు ఉన్నట్లు లెక్కతేల్చారు. ఇందులో పురుషులు 1,67,686 మంది, మహిళలు 1,78,553 మంది ఓటర్లు ఉన్నారు. 20 జెండర్ ఓట్లు ఉన్నాయి. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం ఈ సారి 33 వేల 765 మంది ఓటర్లు పెరిగారు. గత ఎన్నికల్లో 3,12,494 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,52,942 మంది ఉండగా ఈ సారి 14,744 మంది పెరిగారు. మహిళలు గత ఎన్నికల్లో 1,59,535 మంది ఉండగా ఈ సారి 19,018 మంది పెరిగారు.

● మహిళా ఓటర్లే కీలకం

జిల్లాలోని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మహిళల ఓట్లే కీలకం కానున్నాయి. పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం 3,46,259 మంది ఓటర్లు ఉండగా ఇందులో మహిళలే 1,78,553 మంది ఉన్నారు. పురుషులు 1,67,686 మంది ఉన్నారు.మహిళలే అధికంగా 10,867 మంది ఉన్నారు. దీంతో మహిళలే ఓటింగ్‌లో కీలకంగా అభ్యర్థుల గెలుపుపై ప్రభావం చూపే పరిస్థితులు ఉన్నాయి.

జిల్లాలో పురుషులు, మహిళల ఓట్లు

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
బోయినపల్లి	14,681	15,595	30,276
చందుర్తి	13,220	14,394	27,614
ఇల్లంతకుంట	19,391	20,512	39,903
గంభీరావుపేట	17,543	18,639	36,183
కోనరావుపేట	16,795	17,666	34,461
ముస్తాబాద్	18,529	19,613	38,142
రుద్రంగి	6234	7006	13,243
తంగళ్లపల్లి	18,372	19,432	37,804
వీర్నపల్లి	5713	5836	11,549
వేములవాడ	8877	9296	18,189
వేములవాడరూరల్	8914	9699	18,613
ఎల్లారెడ్డిపేట	19,417	20,865	40,282
మొత్తం	1,67,686	1,78,553	3,46,259 (జెండర్ 20)

● రిజర్వేషన్లపై ఆసక్తి

జిల్లాలో 2019 గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 255 గ్రామ పంచాయతీలు 2240 వార్డులకు మూడు విడతలుగా ఎన్నికలు జరిగాయి. 255 సర్పంచ్ స్థానాల్లో 126 జనరల్ కాగా 129 మహిళలకు కేటాయించారు. 115 జనరల్ స్థానాల్లో మహిళలకు 58 కాగా 57 జనరల్‌కు కేటాయించారు. 25 గిరిజనులకు ముందే రిజర్వ్ చేయగా ఆ స్థానాల్లో 13 మహిళలకు, 12 జనరల్ ఉన్నాయి. మరో 6 రిజర్వ్ స్థానాల్లో 3 మహిళలకు, 3 జనరల్‌కు కేటాయించారు. ఎస్సీలకు 52 కేటాయించగా 26 జనరల్ 26 మహిళలకు ఉన్నాయి. బీసీలకు 57 కేటాయంచగా మహిళలకు 29, జనరల్‌కు 28 ఉన్నాయి. ఈ సారి రిజర్వేషన్ల ప్రక్రి యలో మార్పులు వస్తాయని భావిస్తున్నారు. 2018లో రూపొందించిన పంచాయతీరాజ్ చట్ట సవరణలో 34 శాతం నుంచి 23 శాతానికి బీసీ రిజర్వేషన్లు తగ్గించారు. దీనిపై హైకోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. ప్రస్తు తం 50 శాతం రిజర్వేషన్ల గరిష్ట పరిమితి ఉండడంతో బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. 44 శాతం పోను మిగిలిన 6 శాతం బీసీలకు కేటాయిస్తారని భావిస్తు న్నారు. బీసీలకు 6 శాతం కేటాయిస్తే ప్రస్తుతం ఉన్న రిజ ర్వేషన్ల స్థానాలు మారనున్నాయి. ఓటరు జాబితా రావ డంతో గ్రామాల్లో సందడిగా మారింది. బీసీ గణన తరు వాతే ఎన్నికల నిర్వహణ ఉండబోతున్నదని చెబుతున్న క్రమంలో రిజర్వేషన్లు తారుమారు అవుతాయని భావిస్తున్నారు.



హాజరైన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 29 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి గోశాలలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం గోపూజ కార్యక్రమానికి హాజరయ్యారు. వేములవాడ పట్టణంలోని జగిత్యాల రోడ్డులో గల గోశాలకు వెళ్లిన కలెక్టర్ గోపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఉన్నారు.

నేడు అర్బన్ బ్యాంక్ సర్వసభ్య సమావేశం

సిరిసిల్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ 38వ వార్షిక మహాసభ సోమవారం సిరిసిల్ల పద్మశాలి కల్యాణ భవనంలో చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు బ్యాంక్ సీఈవో పత్తిపాక శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలో 2022 -23, 2023- 24 సంవత్సరాలకు సంబంధించిన జమా ఖర్చులు, ఆస్తి, అప్పుల ప ట్టికలు ఆమోదించడంతోపాటు 2024 - 25 సంవత్సరం అంచనా బడ్జెట్‌పై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

మహిళా కార్మికులను వేధిస్తే చర్యలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 29: మహిళా కార్మికులను వేదింపులకు వేదిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చేనేత జౌళిశాఖ ఏడీ మిట్టకోల సాగర్ అన్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌శివారులో ఏర్పాటు చేసిన అపెరల్ పార్క్‌లోని గ్రీన్ నీడిల్ కంపెనీలో పని చేస్తున్న మహిళా కార్మికులను అనుచిత వ్యాఖ్యలతో వేదింపులకు గురిచేస్తున్న కంపెనీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం రమణ ఫిర్యాదు మేరకు ఆదివారం గ్రీన్ నీడిల్ కంపెనీలో పని చేస్తూన్న మహిళా కార్మికులతో మాట్లాడి వేధింపులకు గురి చేస్తున్న దానిపై విచారణ చేపట్టారు. మహిళలపట్ల సిబ్బంది దురుసుగా మాట్లాడి నట్లు విచారణలో తేలిందని, గౌరవంగా ఉండాలని సూచించారు. కంపెనీ యాజమాన్యం మహిళాకార్మికుల పట్ల సిబ్బంది గౌరవంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పార్క్‌లోని కంపెనీల్లో పని చేసే కార్మికులు తమ సమస్యలు ఉంటే నంబరు 9160016043లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

స్థానిక ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలి



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

చందుర్తి, సెప్టెంబరు 29 : స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ ఢంకా మోగించాలని వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. చందుర్తి, రుద్రంగి మండలాల కార్యకర్తలతో లింగంపేట శివారులోని అటవీ ప్రాంతంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనంతోపాటు వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఆచరణ సాధ్యం కానిహామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలాన్ని, బలగాన్ని చూపించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, దేగావత్ తిరుపతి, సింగిల్ విండో చైర్మన్లు జలగం కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్లు ఏనుగుల శ్రీనివాస్, దప్పుల అశోక్, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, నాయకులు గంగం మహేష్, మాడిశెట్టి ఆనందం, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

తారురోడ్డుపై గుంతలు.. వాహనదారుల ఇక్కట్లు

- 15 ఏళ్ల క్రితం నిర్మాణం
- బ్రిడ్జి వద్ద కుంగిన రోడ్డు
- పట్టించుకోని అధికారులు



మారుపాక సుద్దాల గ్రామాల ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత

కోనరావుపేట, సెప్టెంబరు 29: కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన తారు రోడ్డు గుంతల మయంగా మారుతోంది. తారు రోడ్డుపై గుంతలుగా ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వేములవాడ నంది కమాన్ నుంచి మారుపాక మీదుగా సుద్దాల, కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే మార్గంలో 15 సంవత్సరాల క్రితం డబుల్ రోడ్డు ఏర్పాటు చేశారు. మారుపాక, సుద్దాల గ్రామాల మధ్యలో తారు రోడ్డు దెబ్బతిని ప్రధాన రహదారి గుంతలుగా మారింది. అలాగే ఈ రెండు గ్రామాల మధ్యలో ఉన్న బ్రిడ్జి వద్ద కూడా రోడ్డు కుంగి గుంతలుగా ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు రద్దీగా ఉండే ఈ ప్రధాన రహదారి గుంతలుగా ఏర్పడడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాకుండా గుంతలుగా ఏర్పడి ప్రమాదంగా తయారయ్యాయి. ఈ రెండు గ్రామాల మధ్య తారు రోడ్డు గుంతలుగా ఏర్పడ్డ చోట మరమ్మతు చేపట్టి ఇబ్బంది కలగకుండా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

ఐదు నెలలుగా ఇబ్బందులు



- దొబ్బల ప్రకాష్, ప్రకృతి ప్రేమికుడు, సుద్దాల

మారుపాక సుద్దాల ప్రధాన డబుల్ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఐదు నెలలుగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ గుంతలతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతు చేపట్టాలి.

ఆధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ



వేములవాడ పట్టణ వైద్యులతో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సీఐ వీర ప్రసాద్

వేములవాడ, సెప్టెంబర్ 29: ఆధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. వేములవాడ పట్టణానికి చెందిన వైద్యులతో శనివారం రాత్రి స్థానిక మహాలింగేశ్వర గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న నేరాలను నియంత్రిం చేందుకు అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆధునిక సాంకేతిక పరికరాలను ఉపయో గిస్తున్నామని, ఈ క్రమంలో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను అదుపు చేసేందుకు, నేరాలకు సంఘ విద్రోహ పనులకు పాల్పడే వారిని గుర్తించి శిక్షించే అవకాశం ఉందని అన్నారు. ఆసుపత్రులకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలతో పాటు, అనుకోకుండా జరిగే పరిణామాలు, నేరాలను నియంత్రించేందుకు వైద్యులం దరూ తమ ఆసుపత్రుల ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచిం చారు. తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఆసుపత్రితోపాటు రహదారిని కూడా వీక్షించే విధంగా ఉండాలని చెప్పారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో 24 గంటల భద్రత ఉంటుందని సూచించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ వీరప్రసాద్, వైద్యులు కోటగిరి మనోహర్, ఆనంద రెడ్డి, నాగ రమేశ్, నల్ల మధు, చీకోటి సంతోష్ కుమార్, అనిల్ కుమార్, సంతోష్ చారి, వెంకట్, ప్రదీప్, మహేందర్, నవీన్, భార్గవి, సత్యవతి, ఉష, నిర్వాహకులు గంద్ర రాజు, గూడూరి మధు తదితరులు ఉన్నారు.

పోచమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి, సెప్టెంబరు 29 : రుద్రంగి మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ, ఇందూరు పోచమ్మ, ఈరన్నపేట పోచమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, సామ మోహన్ రెడ్డి, కొమిరె శంకర్, గండి నారాయణ, చెలుకల తిరుపతి, పల్లి గంగాధర్, ఇప్ప మహేష్, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, ఎర్రం రాజలింగం, స్వర్గం పరాందామ్, సిరికొండ రవి, గంధం మనోజ్, పడాల శ్రీనివాస్, దువ్వాక గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



వేములవాడలో రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు



రాజన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, సెప్టెంబరు 29: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి శీఘ్రదర్శనం, ధర్మదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌లో భక్తులు ఆలయంలోకి ప్రవేశించి పార్వతీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బం దులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, గజవెల్లి రమేష్‌బాబు, సూపరిండెంట్‌లు తిరుపతి రావు, ప్రోటోకాల్ అధికారి అశోక్, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న శృంగేరి పీఠం శిష్య బృందం

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ఆదివారం రోజున శృంగేరి పీఠం సంచాలకులు పసర్లపాటి బంగారయ్య శర్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి వచ్చిన అయన స్వామివారి ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. అనంతరం ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీజగద్గురు సేన ట్రస్ట్ వేములవాడ ఆధ్వర్యంలో వరల్డ్ ఇన్ఫంట్ చైల్డ్ ఎడ్యూకేషన్, తెలంగాణ భారతీయ యూనివర్సిటీ స్థాపన కోసం కరపత్రాలను ఆవిష్కరించారు.

ఫైనాన్స్ వ్యాపారిపై సీపీకి ఫిర్యాదు

హుజూరాబాద్, సెప్టెంబరు 29: హుజూరాబాద్‌కు చెందిన ఓ ఫైనాన్స్ వ్యాపారి డబ్బుల కోసం ఓ ప్రజాప్రతినిధిని బెదిరింపులకు గురి చేయడంతో ఆదివారం సీపీకి ఫిర్యాదు చేశారు. 40ఏళ్లుగా హుజూరాబాద్‌లో ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గతంలో పోలీసులు కూడా ఇంటిపై రైడింగ్ చేసి, నగదును పట్టుకున్నారు. మండలంలోని ఓ ప్రజాప్రతినిధిని దూషించడంతో ఆదివారం సీపీ అభిషేక్ మొహంతికి ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టాలని పోలీసులను ఆదేశించినట్లు సమాచారం.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, సెప్టెంబర్ 29: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. కొర్కల్ గ్రామానికి చెందిన టాక్టర్ యాజమానులు సంపంగి రాములు, సుద్దాల దేవుడు అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమంగా ఇసుక రవాణ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలి

● ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి

కరీంనగర్‌టౌన్, సెప్టెంబరు 30: ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను సరిచేసిన తర్వాతనే జీవో 25ను అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కరీంనగర్‌లోని వివేకానంద విద్యానికేతన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పీఆర్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి జిల్లా కార్యకర్తల శిక్షణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ సర్వీస్‌కు సంబంధించిన లీవ్‌రూల్స్, పెన్షన్‌పై కనీస అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఆ ఉద్దేశంతోనే ఎస్టీయూ ఉపాధ్యాయులందరికీ అనుభవజ్ఞులైన వారిచే శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తుందని చెప్పారు. సీసీఏ రూల్స్, ఫిక్సేషన్, సీనియార్టీ లెక్కింపు తదితర అంశాలపై సీనియర్ నాయకుడు పి.రమేశ్, శ్రీధర్‌రావు, సుధాకర్, పున్న గణేశ్ తదితరులు అవగాహన కల్పించారు. అనంతరం ఉమ్మడి జిల్లాలో పదవీ విరమణ, పదోన్నతులు పొందిన సంఘ బాధ్యులను ఘనంగా సన్మానించారు. ఈసమావేశంలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి రవీంద్రాచారి, సతీష్, శ్రీకాంత్ రెడ్డి, హరికిరణ్, శంకర్, వివేకానంద విద్యానికేతన్ చైర్మన్ సొగాని కొమురయ్యమ, రాష్ట్ర బాధ్యులు భూమయ్య, రవి, సంతోష్‌కుమార్, తిరుపతిరావు, సాన కిషన్, దయానంద్, తిరుపతిరెడ్డి, వెంకటస్వామి, రాజు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఆస్తి పంచాయితీ

● మొదటి భార్య పిల్లల దాడిలో తండ్రి మృతి

వేములవాడ, సెప్టెంబరు 29: ఆస్తి కోసం మొదటి భార్య పిల్లలు పెట్టిన పంచాయితీ ఘర్షణకు దారితీసింది. పిల్లలు చేసిన దాడిలో తండ్రి మృతి చెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఆదివారం చోటుచేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వేములవాడకు చెందిన మామిం డ్ల మల్లయ్య (53) మొదటి భార్య బాలవ్వ 15 సంవత్సరాల క్రితం మరణించింది. మొదటి భార్య ద్వారా మల్లయ్యకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మొదటి భార్య మరణానంతరం మల్లయ్య పద్మను రెండో వివాహం చేసుకున్నాడు. పద్మ ద్వారా ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు జన్మించారు. తమకు రావాల్సిన వాటా ప్రకారం ఆస్తి రాసి ఇవ్వాలంటూ మల్లయ్య మొదటి భార్య కుమారుడు రాజు, కుమార్తెలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం కుల పెద్దల సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేశారు. పంచాయితీ జరుగుతున్న క్రమంలో వెంటనే ఆస్తి రాసి ఇవ్వాలంటూ రాజు డిమాండ్ చేయగా రెండో భార్య పిల్లలు చిన్న వాళ్లని, వాళ్లు పెరిగి పెళ్లిళ్లు చేసిన అనంతరం ఆస్తి పంపకాలు చేస్తానని చెప్పి మల్లయ్య పంచాయితీ మధ్యలో నుంచి బయటకు వెళ్లిపోయేందుకు ప్రయత్నించాడు. ఆవేశానికి లోనైన కుమారుడు రాజు, కుమార్తెలు, అల్లుళ్లు మల్లయ్యను అడ్డుకొని గొడవకు దిగారు. మల్లయ్య అక్కడి నుంచి వెళ్లిపోవడంతో వారు మల్లయ్య ఉన్న ఇంటికి వచ్చి కత్తి, కర్రతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడ్డ మల్లయ్య కుప్పకూలాడు. చికిత్స కోసం ఆయనను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మల్లయ్య రెండో భార్య పద్మపై కూడా దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం పద్మను కరీంనగర్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సీఐ వీరప్రసాద్ పరిశీలించారు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

దిగువకు విడుదల అవుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువ గోదావరి లోకి ఆదివారం వరద నీరు విడుదల కావడం కొనసాగింది. ప్రాజెక్టుకు చెందిన పది గేట్లను ఎత్తి గోదావరిలోకి 29,678 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 44,268 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 44,268 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

బాల్ బ్యాడ్మింటన్ అంతర్ జిల్లా జట్ల ఎంపిక



అంతర్ జిల్లా జట్టుకు ఎంపికయిన క్రీడాకారులు

మానకొండూర్, సెప్టెంబరు 29 : మానకొండూర్‌లోని గురుకుల పాఠశాలలో ఆదివారం బాల్ బ్యాడ్మింటన్ అండర్-19 జూనియర్స్ బాల బాలకల అం తర్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టుకు కే యశ్వంత్, బి అనివర్స, జే వేణు, బి సాయిరాం, కే అభిలాష్, బి స్వాతిక్‌నాయక్, ఎస్‌కే ఫైజాన్, బి విగ్నేష్, డి దినేష్‌కార్తిక్, అభిలాష్ ఎంపిక అయ్యారు. బాలికల జట్టుకు మానస, వినుత, సిరిచందన, సిరివర్షిని, సాయితి, నేహ, స్నేహిత, కళ్యాణి, రమ్య, జేష్నిలు ఎంపిక అయ్యారు. త్వరలో కామారెడ్డిలో నిర్వహించే అంతర్ జిల్లా పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి, ఏ రాములు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వినోద్‌కుమార్, పీఈటీలు వి శివప్రసాద్, అలేఖ్య, భవాని పాల్గొన్నారు.



ఇప్పపల్లి - పోతారం అడవుల్లో చదును చేసిన అటవీ భూమి



నరికివేసిన చెట్లు

కనుమరుగవుతున్న అటవీ సంపద

● కాకి లెక్కలతో తప్పుదోవ
● అవినీతి ఫలితమే అడవి ధ్వంసం

కథలాపూర్, సెప్టెంబరు 29 : అడవి తల్లిపై గొడ్డలి వేటు కారణంగా వందలాది ఎకరాల దట్టమైన అడవులు కనుమరుగవుతున్నాయి. అడవిని కంటికి రెప్పలా కాపాడాల్సిన కొందరు అధికారుల నిర్వాకం ఫలితంగా ఏటేటా ఎడారిగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అవినీతికి అలవాటు పడి అనధికారిక అనుమతులు ఇస్తున్న క్రమంలోనే యంత్రాలు అడవిలోకి ప్రవేశించి పచ్చని చెట్లు నేల కూల్చడానికి ఆస్కారం కలుగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఓ వైపు అటవీ విస్తీర్ణం పెంచడానికి పాటు పడాలని సూచిస్తుండగా ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డ అధికారుల కారణంగా రోజు రోజుకూ పదుల ఎకరాల మేర ధ్వంసం అవుతుందనే అపవాదు మూటగట్టుకుంటున్నారు. మండలంలోని ఇప్పపల్లి-పోతారం గ్రామాల మధ్య గడిచిన రెండేళ్లుగా కొనసాగుతున్న వివాదం పరిష్కరించడంలో చేస్తున్న జాప్యం భారీ నష్టానికి దారి తీసిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

● లెక్కకు మించి ధ్వంసం

అటవీ భూములపై కన్నేసిన కొందరు రాత్రి వేళల్లో యంత్రాలతో చెట్లను తొలగించి బ్లేడ్ ట్రాక్టర్లతో చదును చేస్తున్నప్పటికీ పహారా కాయాల్సిన అధికారులు అటువైపు నామమాత్రంగా వెళ్తుండడం పలు అను మానాలకు తావిస్తోంది. విచ్చలవిడిగా అడవిని నరికి వేస్తున్నట్టు అనేక ఫిర్యాదులు వస్తుండగా కఠిన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వస్తున్నాయి. పోతారానికి చెందిన కొందరు అడవిలో అడ్డా వేయడానికి ఫారెస్ట్ అధికారుల ప్రమేయం ఉందనే చర్చ జోరుగా సాగుతోంది. అయితే ఆ శివారు తమదేనంటూ ఇప్పపల్లి వాసులు వాదిస్తున్న నేపథ్యంలో సరిహద్దు వివాదం రాజుకుని రగులుతోంది. ఇప్పటికే సుమారు 300 ఎకరాల మేర అడవి ధ్వంసం అయిందనే ఆరోపణలు వస్తుండగా ఫారెస్ట్ యంత్రాంగం మాత్రం 50 ఎకరాల లోపు మాత్రమే పోడుకు గు రైందని పేర్కొంటున్నారు. ధ్వంసం కాబడ్డ పరిసరాలను చూసిన అధికారులు మాత్రం ఎంత మేర అటవీ భూమి నష్టపోయిందని మాత్రం అధి కారికంగా ప్రకటించడం లేదు. యధేచ్ఛగా అడవి నరికివేతకు గురవు తున్న క్రమంలో ఇరు గ్రామాల మధ్య శాంతి భద్రతల సమస్యగా పరిణ మించింది. తమ శివారు అడవిని కాపాడుకుందామని ప్రయత్నాలు చే స్తుంటే తమపై కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పపల్లి వా సులే అడవిని నరికవేస్తున్నారని పోతారానికి చెందిన పలువురు ఫిర్యా దులు చేసుకుంటుండడం సర్వసాధారణంగా మారిపోయింది. కంచే చేను మేసిన చందంగా ఓ అటవీ అధికారి నిర్వాకంపై మండలంలో తీవ్ర చర్చ జరుగుతోంది. అవినీతి ఫలితంగానే అడవి విధ్వంసానికి కారణమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆరుగురిపై కేసులు నమోదు చేశాం

రాజారాం తండాలో సుమారు పదెకరాల మేర అడవిని నరికినట్లు మా సిబ్బంది గుర్తించారు. ధ్వంసం చేసిన వారి వివరాలు సేకరించాము. ఆరుగురిపై అటవీ చట్టం కింద కేసులు నమోదు చేసాం. ఇప్పపల్లికి చెందిన 10 మందిపై కేసులు నమోదు చేసి చార్జిషీట్ కోర్టులో వేస్తున్నాం. అడవిని నరికివేసే వారిపై కఠినంగా ఉంటాం. సిబ్బందిని ప్రమత్తం చేస్తున్నాం.

- పద్మారావు, ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో, మెట్‌పల్లి

గోదావరిలో కొట్టుకుపోయిన ముగ్గురు యువకులు

● ఒకరి గల్లంతు.. ఇద్దరిని కాపాడిన జాలర్లు

ధర్మపురి, సెప్టెంబరు 29 : జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని రాయపట్నం గోదావరి నదిలో ఆదివారం ముగ్గురు యువకులు కొట్టుకుపోయారు. ఇందులో ఇద్దరు యువకులను జాలర్లు కాపాడారు. మరో యువకులు గల్లంతయ్యాడు. కరీంనగర్, శ్రీనగర్ కాలనీకి చెందిన రాగుల పవన్ కుమార్ (19) అనే యువకుడు తన స్నేహితులు కొట్టె నవీత్ వర్మ, బోగే అశ్విన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై దుర్గాదేవి మాలధారణ సందర్భంగా రాయపట్నం గోదావరి స్నానానికి వచ్చారు. మధ్యాహ్నం సమయంలో గోదావరి నదిలో దిగి స్నానం చేస్తుండగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ముగ్గురు యువకులు అందులో కొట్టుకుపోయారు. అక్కడే ఉన్న జాలర్లు గమనించి నవిత్, అశ్విన్ లను బయటకు తీశారు. అనంతరం వైద్య చికిత్స కోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. మరో యువకుడు రాగుల పవన్‌కుమార్ ఆచూకీ మాత్రం తెలియలేదు. పవన్ తండ్రి రాగుల రాజు ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ గంగుల మహేష్ తెలిపారు.

చుండూరు సీతకు రజనీశ్రీ పురస్కారం



పురస్కారం అందజేస్తున్న జీవీ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 29: ప్రతీ యేటా రాష్ట్ర స్థాయిలో జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ పురస్కార ప్రదాతగా తన తండ్రి పేరిట ఇచ్చే రజనీశ్రీ పురస్కారాన్ని చుండూరు సీతకు ప్రదానం చేశారు. కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నవలా విభాగంలో సారంగి నవలకు గాను చుండూరు సీతకు పురస్కారం కింద 10,116 రూపాయల నగదు, జ్ఞాపికను పురస్కార ప్రదాత జీవి శ్యాంప్రసాద్‌లాల్ అందించి సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సారంగి నవల చదువుతుంటే విశ్వనాథ గుర్తుకు వస్తారని, అద్భుత కవిత్వ శైలితో, భావుకతతో ఈ నవల సాగిందని అన్నారు. పురస్కార గ్రహీత సీత మాట్లాడుతూ నిరంతర సాహితీ చైతన్యంతో వెల్లివిరిసే కరీంనగర్ జిల్లా గడ్డపై తాను ఒక మహనీయుని పేరిట పురస్కారాన్ని స్వీకరించడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గాజుల రవీందర్, రజనీశ్రీ సతీమణి గాజుల సత్యవతి, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్ మచ్చ హరిదాసు, దాస్యం సేనాధిపతి, డాక్టర్ పొన్నం రవిచంద్ర, అన్నవరం దేవేందర్, సంస్థ ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్ సమన్వయం మధ్య సాగిన ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు స్తంభంకాడి గంగాధర్, ముత్తినేని శ్రీనివాస్, గంగుల శ్రీకర్, అనంతోజు పద్మశ్రీ, నీలగిరిఅనిత పాల్గొన్నారు.

సమాజంలో అసమానతలు తొలగించడానికి
మహిళలు పోరాటం చేయాలి

భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 29 : సమాజంలో అసమానతలు తొలగించడానికి మహిళలు పోరాటానికి సిద్ధంకావాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన విస్తృతస్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో సనాతన ధర్మం పేరుతో స్త్రీలపై విధించిన ఆంక్షలు, మూఢాచారాలు, కట్టుబాట్లతో మహిళా శక్తిని నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. వీటిని ప్రతిఘటించి పెట్టుబడిదారి వ్యవస్థకు ఘోరి కట్టి పురుష ఆధిపత్యం లేని పాలన చేయాలన్నారు. స్త్రీలు పురుషలతో సమానంగా పని చేస్తున్నారని, మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని తెలిపారు. కానీ నేడు దేశంలో మహిళలపై అత్యాచారాలు, వరకట్న దురాచారాలకు బలవుతూనే ఉన్నారని ఆమె ఆవేదన వెలిబుచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పినప్పటికీ అది అమలు కావడం లేదన్నారు. గ్రామ స్థాయిలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూను నిర్మించి మహిళ సాధికారితక పోరాటాలను తీవ్రతరం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా అధ్యక్షుడు తాండ్ర సదానందం మాట్లాడుతూ నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో మహిళల స్థితి దిగజార్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఆర్థిక విధానాలను అవలంభిస్తున్నారని, వీటిని మహిళలు ఐక్య ఉద్యమాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు శనిగరపు తిరుమల, విజయలక్ష్మి, భాగ్య, ఓదమ్మ, తార, రాజమ్మ, విజయ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

జ్వరంతో చిన్నారి మృతి



మనీషా (ఫైల్)

రాయికల్, సెప్టెంబరు 29 : మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన తాలుక మనీషా (12) జ్వరంతో శనివారం అర్ధరాత్రి మృతి చెంది నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మనీషా 7వతరగతి చదువు తోంది. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు చిన్నారిని జగిత్యాలలోని ఆస్పత్రిలో చేర్పించారు. జ్వరం తీవ్రం కావడంతో ఆమెను కుటుంబసభ్యులు కరీం నగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతి చెం దినట్లు తెలిపారు. గ్రామంలో జ్వరాలతో గ్రామ స్థులు, పలువురు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నార ని, అధికారులు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, సెప్టెంబరు 29: శంకరపట్నం మండలం ఆముదాలపల్లి గ్రామ శివారులో కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆముదాపల్లి గ్రామానికి చెందిన గడ్డం కుమారస్వామి, చిమ్మని అనుదీప్ అనే వ్యక్తులు ఆముదాలపల్లి నుంచి కేశవపట్నం వైపు కారులో వెళ్తున్నారు. ఆము దాలపల్లి నల్లాల బావి సమీపంలో కారు అదుపు తప్పి బండకు ఢీ కొని పొలంలోకి దూసు కెళ్లింది. ఈ ప్రమాదంలో కుమారస్వామి, అనుదీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మానేరువాగులో మూడు ఇసుక ట్రాక్టర్ల గల్లంతు

● వాహనాలను వదిలి ఒడ్డుకు చేరుకున్న డ్రైవర్లు, కూలీలు

మానకొండూర్, సెప్టెంబరు 29: మండలంలోని శ్రీనివాస్‌నగర్ మానేరువాగులో మూడు ఇసుక ట్రాక్టర్లు శనివారం రాత్రి గల్లంతయ్యాయి. కాగా డ్రైవర్లు, కూలీలు వాహనాలను వదలి ఒడ్డుకు చేరుకోవడంతో ముప్పు తప్పింది. ఇసుకను కరీంనగర్‌కు తరలించేందుకు రాజు, అంజి, మల్లేశం అనే ట్రాక్టర్ల యజమానులతో పాటు మరో ముగ్గురు కూలీలు శనివారం సాయంత్రం మానేరువాగులోకి వెళ్లారు. అప్పటికి ఎల్ఎండీ గేట్లు తెరిచారన్న సమాచారం లేకపోవడంతో మూడు ట్రాక్టర్లు వాగులోకి తీసుకెళ్లి ఇసుకను లోడు చేశారు. తిరిగి వెళ్లే సమయానికి నీటి ఉధృతి పెరిగింది. దీంతో ఆందోళనకు గురైన డ్రైవర్లు ఒడ్డుకు చేరేం దుకు వెళ్తుండగా మొదటి ట్రాక్టరు దిగబడిపోయింది. నీటి ప్రవాహం అధికం కావడంతో డ్రైవర్లు, కూలీలు చేసేది ఏమీ లేక ట్రాక్టర్లను వాగులో వదిలేసి ఒడ్డుకు చేరుకున్నారు.

పేకాట స్థావరంపై దాడి

● ఎనిమిది మంది అరెస్టు
● రూ. ఎనిమిది వేలు స్వాధీనం

జ్యోతినగర్, సెప్టెంబరు 29 : ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజయ్‌గాంధీ నగర్లో ఆదివారం ఒక పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. సంజయ్ గాంధీ నగర్‌లో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ, సిబ్బంది స్థావరంపై దాడి చేశారు. పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 8,040 రూపాయలను సీజ్ చేశారు. అలాగే ఐదు సెల్‌ఫో న్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎన్టీపీసీ పోలీసులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ధర్మారం, సెప్టెంబరు 29: ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి వద్ద రాష్ట్ర రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వామి నాయక్(30) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం.. ఆదివారం మండలంలోని లంబాడితండ కె గ్రామానికి చెందిన అజ్మీర స్వామి నాయక్, గాదం రవి ఇద్దరు వ్యక్తులు బైకుపై ధర్మారం వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్వామి నాయక్‌ను కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. రవి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. అతి వేగంగా నడిపిన కారు డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం కాదు

● అన్ని వర్గాలకు న్యాయం జరగాలి ● మాలల ఆత్మీయ సదస్సులో ఎమ్మెల్యేలు వివేక్, నాగరాజు



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యేలు వివేక్, నాగరాజు, మాల సంఘాల నాయకులు

జ్యోతినగర్, సెప్టెంబరు 29 : ఎస్సీ వర్గీకరణకు, సుప్రీంకోర్టు తీర్పునకు తాము వ్యతిరేకం కాదని చెన్నూరు, వర్ధన్న పేట ఎమ్మెల్యేలు జి వివేక్, కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆఫ్ మాల పెద్దపల్లి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీపీసీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మాలల ఆత్మీయ సదస్సులో వారు ప్రసంగించారు. తాము అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అన్నివర్గాలకు న్యాయం జరగాలని కోరుకుంటున్నామన్నారు. తాజాగా కులగణన జరిగిన తరువాతనే ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల అమలు జరగాలనేది తమ ప్రధాన డిమాండ్ అన్నారు. మాలలపై పెద్ద ఎత్తున దాడి జరుగుతున్నదని, మంద కృష్ణమాదిగ, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాలలపై వ్యతిరేకంగా మాట్లాడు తన్నారన్నారు. మాదిగలకు మాలలు ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తప్పుడు భావజాలాన్ని మాదిగలలో నింపేదుకు కుట్ర జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారంతో ప్రజల్లో మాలలను అప్రతిష్టపాలు చేసేందుకు జరగుతున్న కుట్రలను ఆపేయాలన్నారు. ఎన్నికల సమయంలో తమపై తప్పుడు ప్రచారం చేశారని, నేటికీ తాము మాదిగలకు వ్యతిరేకమంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. అన్నికులాల వారు సభలు, సమావేశాలు జరుపుకుంటారని, మాలలు సమావేశం నిర్వహిస్తే ఎందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. అన్నిరాజకీయ పార్టీలను కలుపుకొని శాస్త్రీయమైన వర్గీకరణ కోసం కృషిచేస్తామని తెలిపారు. అన్ని జిల్లాల్లో మాలలు, మాల ఉద్యోగులు ఐక్యంగా ఉడాలని, ఐక్యంగా ఉన్నప్పుడే తమ హక్కులు, డిమండ్లను సాధించవచ్చని తెలిపారు. మాలలను ఏకం చేస్తూ నవంబర్‌లో హైదరాబాద్ వేదికగా భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయిచామన్నారు. సభకు ముందు నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు టీం జిల్లా అధ్యక్షుడు బద్దం డానియెల్ అధ్యక్షత వహించగా, సమతా సైనికదళ్ జాతీయ కార్యదర్శి దిగంబర్‌కాంబ్లి, డేనియల్, మాలల సంఘం సీనియర్ నాయకులు గుమ్మడి కుమారస్వామి, ముక్క సుదర్శన్, కె ఆనందర్, కార్పొరేటర్లు జేవీ రాజు, దొంత శ్రీనివాస్, దేవ వెంకటేశం, దామెర నర్సయ్య, రమేష్, పసుల రామ్మూర్తి, రమేష్, భాస్కర్, నర్సయ్య, జగన్, మోహన్, రవికుమార్, దీపక్, కకకరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి

● అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అంజిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అంజి రెడ్డి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 29: రాష్ట్రంలో లారీ ఓనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సి. అంజిరెడ్డి డిమాండ్ చేశారు. పెద్దపల్లి లారీ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్క్రాప్ పాలసీ, క్వార్టర్లీ టాక్స్ మాఫీ, సింగిల్ పర్మిట్ తదితర అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించుకునే వరకు లారీ ఓనర్స్ ఐక్యంగా కదలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, పెద్దపల్లి లారీఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ భారీ, కార్యదర్శి బూత్కూరి తిరుపతి, ఉపాధ్యక్షుడు పి శీనివాస్, సంయుక్త కార్యదర్శి ఎండీ జహంగీర్, కోశాధికారి ఎండీ అఫ్జల్, రాష్ట్ర జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఊర చెరువులో పడి ఒకరి మృతి

చిగురుమామిడి, సెప్టెంబరు 29: మండలంలోని చిన్న ముల్కనూర్ గ్రామానికి చెందిన కయ్యం నరేష్(18) అనే వ్యక్తి ఆదివారం ప్రమాదవశాత్తు ఊర చెరువులో మునిగి మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఐదుగురు ఆదివారం చేపల వేటకు వినియోగించే తెప్ప పై సరదాగా ఊర చెరువులోకి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బోటు మునిగింది. దీంతో నరేష్ అనే వ్యక్తి నీటిలో పడి మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు చెరువులో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. మిగితా నలుగురు సురక్షితంగా ఉన్నారు. ఎస్సై బండి రాజేశ్ చెరువు వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలసుకు న్నారు. నరేష్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధర్మపురిలో ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు



ధర్మపురి క్షేత్రంలో బొడ్డెమ్మ ఊరేగింపులో యువతులు

ధర్మపురి, సెప్టెంబరు 29 : ధర్మపురి క్షేత్రంలో బొడ్డెమ్మ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్దంభట్ల వారి వీధి, రామానందేశ్వర వారి వీధి ఆధ్వర్యంలో వేర్వేరుగా నెలకొల్పిన బొడ్డెమ్మను అత్యంత భక్తి శ్రద్ధలతో మహిళలు పూజించారు. అనం తరం మహిళలు సాయంత్రం వేళలో బొడ్డెమ్మతో గోదా వరి నదికి బయలు దేరారు. రాత్రి నదీ తీరాన బొడ్డె మ్మను గోదావరి నదిలో నిమజ్జనం చే శారు. ఈ సందర్భంగా పట్టణ పురపాలక సంఘం ఆధ్వర్యంలో గోదావరి నదీ తీరాన విద్యుత్ దీపాలు అలంకరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ 3. 4వ వార్డు కౌన్సిలర్లు సంగనభట్ల సంతోషి, పురాణపు కిరణ్మయి, శారదా మహిళా మండలి అధ్యక్షురాలు మధ్వాచారి విజయలక్ష్మి, కార్యదర్శి భావి శోభారాణి, గుండి రమాదేవి, రమావాణి, బొజ్జ పుష్ప, సభ్యులు పాల్గొన్నారు. సీఐ రాంనర్సిం హారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ గంగుల మహేష్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మిడ్ మానేరు ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 29: శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 12,650 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. దిగువకు నాలుగు గేట్ల ద్వారా 5060 క్యూసెక్కుల నీటిని ఎల్ఎండీ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. కాగా ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటరకు ప్రస్తుతం 317.72 మీటర్లు ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎం సీలకు ప్రస్తుతం 26.75 టీఎంసీల మేరకు చేరుకొంది.

మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లకు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

ముస్తాబాద్, సెప్టెంబరు 29: ముస్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియామకమైన తలారి రాణినర్సింలు, వైస్ చైర్మన్ వెల్ముల రాంరెడ్డితోపాటు డైరెక్టర్లను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, భాను, శీల ప్రశాంత్ , గాంత రాజు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్ పర్సన్ దంపతులకు సన్మానం



సన్మానిస్తున్న చిన్న నాటి స్నేహితులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 29: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ చైర్ పర్సన్‌గా నియామకమైన నారాయణపూర్ గ్రామానికి చెందిన సబేరాబేగం- గౌస్ దంపతులతోపాటు డైరెక్టర్ తిరుపతిరెడ్డిని చిన్ననాటి స్నేహితులు నారాయణపూర్‌లో ఆదివారం సన్మానించారు. పూర్వ మిత్రుల కమిటీ అధ్యక్షుడు భూమరాజు, సభ్యులు శ్రీనివాస్, రామచంద్రం, రమేశ్, శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, బాబ్జీ, రాంచంద్‌నాయక్, శ్రీశైలం, రవీందర్‌రెడ్డి, అమృత్‌లాల్‌నాయక్, భూపతి, సిద్ధిరాములు, లక్ష్మీనారాయణ, దేవేందర్‌రెడ్డి, బాబు, రాజేశం, నరేశ్, రాజు, రామస్వామి, షరీఫ్, హాజీబాబాట, జాఫర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 29: మండలంలోని వెల్జీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుండ ముత్తయ్యను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం పరామర్శించారు. ముత్తయ్య తల్లి వెంకవ్వ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మాజీ జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఉడుతల వెంకన్న, నాయకులు సంతోష్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి ఉన్నారు.

గౌడ సంఘం కార్యవర్గం

ఇల్లంతకుంట, సెప్టెంబరు 29: మండలకేంద్రంలో గౌడ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఎల్లమ్మతల్లి ఆలయంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా కొయ్యడ రాజయ్య, ఉపాధ్యక్షుడిగా అంతటి రమేష్, ప్రధానకార్యదర్శిగా బండారి శ్రీనివాస్, కోశాధికారిగా ముంజ భాస్కర్, డైరెక్టర్లుగా కొయ్యడ లింగయ్య, సుదగోని నాగేంద్రం, ఒల్లాల రాజు, గైని శ్రీకాంత్, అంతటి రవి, బొంగోని అనీల్, అంతటి రాజయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

గ్రామ పంచాయతీకి హైమాస్ట్ లైట్ల వితరణ

ఇల్లంతకుంట, సెప్టెంబరు 29: మండలంలోని రేపాక గ్రామపంచాయతీకి మాజీ ఎంపీటీసీ కాథ సుమలతమల్లేశం హైమాస్ట్‌లైట్లను ఆదివారం వితరణ చేశారు. బస్టాండ్ ఆవరణలో చీకటిగా ఉంటోందని ప్రజలు తెలపడంతో రూ.5వేల విలువైన లైట్లను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దయాసాగర్, నాయకులు గూడ బాబు, ప్రతాపరెడ్డి, ఆకుల చంద్రయ్య, కనుకయ్య, చంద్రారెడ్డి, బాబు, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘానికి బోరు మంజూరు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 29: మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘం భవనానికి బోరు మంజూరైంది. సంఘం స్థలంలో ఆదివారం బోర్ వేశారు. మంజూరుకు కృషిచేసిన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు యాస తిరుపతి, ప్రధాన కార్యదర్శి అవారు బాలయ్య సంఘ నాయకులు కూన నరేష్, కొట్టె వెంకన్న, ల్యాగల బాగయ్య ఆకుల చంద్రయ్య, బొల్లం పర్శరాం, కముటం పర్శరాం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీలో ప్రథమ బహుమతి

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 29: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఓ దిన పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ పోటీలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ముత్యాల ప్రభాకర్‌రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారు. ఆదివారం కరీంనగర్ పట్టణంలో బహుమతి ప్రదానం చేశారు. 'తెలంగాణ మన పండుగలు- మన సంస్కృతి' విభాగంలో తీసిన బతుకమ్మ ఫొటో రాష్ట్ర స్థాయిలో నిలిచింది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గురువు కుటుంబానికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 29: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గురువు మారెల్లి నాగరాజు కుటుంబానికి పూర్వ విద్యార్థులు రూ.25,100 నగదును ఆదివారం అందజేశారు. నాగరాజు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యా వలంటీర్‌గా పని చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న 2004-2005 విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులు బాసటగా నిలవాలని సంకల్పించారు. సేకరించిన రూ.25,100 నగదును ఆ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జగదీష్, శ్రీనివాస్, శ్రీకాంత్, సతీష్, పవన్, శశిధర్, నరేశ్, అశోక్ పాల్గొన్నారు.

గల్ఫ్ మృతుడి కుటుంబానికి పరామర్శ

బోయినపల్లి, సెప్టెంబరు 29: బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన దాసరి బాబు గల్ఫ్‌లో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధర్మేందర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, పవన్, తిరుపతి ఉన్నారు.

బాధిత కుటుంబాలకు కేకే పరామర్శ

గంభీరావుపేట, సెప్టెంబరు 29 : గంభీరావుపేట మండలంలో ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. కొత్తపల్లిలో కురేష్, బాల్‌రెడ్డి, శ్రీగాధలో పెంటయ్య, కోళ్లమద్దిలో భూపతి, మైపాల్, రాములు, గంభీరావుపేటకు చెందిన రాములు, బాలకిషన్, నాగంపేటకు చెందిన బాలనర్సులు అకాల మరణం చెందారు. పరామర్శించినవారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు నర్సింలు, ఎలుక రాజు తదితరులు ఉన్నారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 29: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వృద్ధుల డేకేర్ సెంటర్‌తో వృద్ధాప్య సమస్యలతో బాధ పడుతున్న గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన వృద్ధురాలు వేదాంతి పద్మావతి (87) ఈ నెల 28న మృతి చెందింది. కేంద్రం నిర్వాహకులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తూఫ్రాన్‌లో ఉంటున్న కొడుకు కన్న తల్లి చనిపోయిందని తెలుసుకుని శనివారం రాత్రి కేంద్రానికి చేరుకున్నాడు. అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్, స్థానికులు శ్రీనివాస్‌రెడ్డి, సల్మాన్, ఎస్ఆర్ఐ సత్యం, చేయూత మిత్ర ఫౌండేషన్ సభ్యులు, పలువురు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామ శివారులోని గిద్దె చెరువు ప్రాంతంలో కన్నతల్లికి కొడుకు గోపాల్ చారి దహన సంస్కారాలు నిర్వహించాడు.

శాకాహారం.. మెరుగైన జీవనం

- ఆకుకూరలు, కూరగాయల్లో పోషకాలు
- అన్ని సమస్యలకూ మంచి ఆహారం
- రేపు ప్రపంచ శాకాహార దినోత్సవం







(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

మనిషి సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా ఉంటేనే చేసే ఎపనైనా సవ్యంగా సాగుతుంది. మనిషికి 'ఆరోగ్యం ఒక వరం' రోజుకు సరిపడా పౌష్టికహారాన్ని తీసుకున్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఇది ఎక్కడినుంచో రాదు. మనకు లభించే కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పుదినుసులు వంటివి తింటే పుష్కలంగా పౌష్టికాహారం లభిస్తుంది. ఇటీవల కాలంలో ఎవరిని చూసినా ఏదో రకమైన ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నట్లు చెబుతున్నారు. ఇందుకు కారణం ఘుమఘుమలాడే మసాలాలు దట్టించి వండే మాంసాహారం. తిన్నప్పుడు ఎంతో రుచికరంగా ఉన్నా తరువాత అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అన్నం, కూరగాయలు, ఆకు కూరలు, గింజలు, పండ్లలోనే ప్రోటీన్‌లు, కార్బోహైడ్రేట్‌లు, విటమిన్‌లు లభిస్తున్నాయని వివరిస్తున్నారు. ఆరోగ్యం, వాతావరణం, మానవీయ తలవైపు ప్రజల దృష్టి మార్చడం కోసం, ప్రపంచ శాకాహారుల మధ్య సమన్వయం కల్పించాలని 1977లో అమెరికాలో వెజిటేరియన్ సొసైటీ ఏర్పడింది. దీని ఆధ్వర్యంలో అక్టోబరు1న ప్రపంచ శాకాహార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శాకాహారంపై వైద్యులు అందిస్తున్న సూచనలివి..

శాకాహారంతో లాభాలు

శాకాహారం తినే మనిషి ఆరోగ్యవంతంగా జీవిస్తాడు, ఉల్లాసంగా, శాంతంగా ఉంటారు. మాంసం తినే వారిలో కన్నా వీరిలో సహజ రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మనిషి మేధస్సును తేజోవంతంగా తయారు చేయడానికి దోహదపడుతుంది. మనిషి జీవన విధానం సాఫీగా సాగుతుంది. అధిక శక్తి కలిగి కష్టపడి పనిచేసిన అలసట లేకుండా ఉంటారు.సంపూర్ణ ఆరోగ్యంగా జబ్బులు లేకుండా ఉంటారు. ఎన్నో పోషక పదార్థాలు లభిస్తాయి, త్వరగా జీర్ణమవుతుంది.పాతకాలంలో అన్నం గంజి వంచేవారు కాదు. ఇప్పుడైతే గంజిని పారబోస్తున్నారు. ఈ గంజిలో విటమిన్ బీ ఉంటుంది. గంజిని పారబోయక పోవడం మంచిది.

శక్తినిచ్చే ఆహారం

మంచి ఆహారం తీసుకోవడమే ఆరోగ్యానికి వరం. ఐదు రకాలుగా విభజించవచ్చు. శక్తినిచ్చే పిండిపదార్థాలు, మాంసకృతులు, కొవ్వు పదార్థాలు, విటమిన్‌లు, ఖనిజ లవణాలు. మన ఊరిలో లభించే ఆకుకూరల్లో కూడా లభిస్తాయి.

శక్తినిచ్చే పదార్థాలు వరి, గోదుమ, రాగులు, జొన్నలు, సజ్జలు, బంగాళదుంపలు, బీట్‌రూట్‌లు.

నూనె పదార్థాలు లభించేవి నూనె, నెయ్యి, డాల్డా

పెరుగుదలకు పప్పు దినుసులు, వేరుశెనగ విత్తనాలు.

రక్తానిచ్చే ఆహారంలో పాలకూర, మెంతి, తోటకూర, గొంగూర, బచ్చలకూర, వంకాయ, బెండకాయ, సోరకాయ, బీరకాయ, మునక్కాయ, టమాటో, ముల్లంగి, క్యాబేజి, క్యారెట్, కాలీఫ్లవర్, సీజన్‌లో లభించే మామిడి, పనస, నారింజ, బొప్పాయి, అరటి, అపిల్, సీతాపలం, జామ, నిమ్మ, దానిమ్మ.

కూరగాయలు కడగకపోతే ప్రమాదం

పురుగుల మందులు ఇటీవలి కాలంలో మనుషులను వణికిస్తున్నాయి. ఏ పండు తిన్నా, ఏ కూరగాయ తీసుకున్నా మొక్కుబడిగా కొన్ని నీళ్లతో కడిగేస్తాం. ఇప్పుడు అలా కడిగితే ఆరోగ్యానిస్తాయని అనుకునే కూరగాయలే కబలించే అవకాశాలు ఉన్నాయి. ఏ కూరగాయలు తీసుకున్నా వాటిలో 70 శాతానికిపైగా పురుగుల మందుల అవశేషాలు ఉన్నాయి. ఎన్నో క్యాన్సర్‌లు, మరెన్నో రుగ్మతలకు కారణమవుతున్నాయి. అలాంటి ఆహారం తినడం ద్వారా పుట్టే బిడ్డలో లోపాలు తలెత్తవచ్చు. డీఎన్ఏ క్రోమోజోమ్‌ల వంటి అత్యంత కీలకమైన పదార్థాల్లో మార్పులు రావచ్చు. సంతాన సామర్థ్యం తగ్గిపోవడం వంటి సమస్యలు వస్తాయి. నాడీ వ్యవస్థను దెబ్బతీసే అవకాశాలు ఉన్నాయి.

నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలి



దిష్టి బొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 29 : పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చింది న్యాయం జరుగుతుందని ప్రజలు నమ్మారని, 12 శాతం టాక్స్ పెట్టడంతో నిత్యావసర సరుకుల ధరలు విపరీతం పెరగాయని అన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరు పేదలు నిత్యావసర సరుకులను కొనలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ వైఫల్యంతో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని, పేదోడి నడ్డి విరిచాయని ఆరోపించారు. ప్రభుత్వాలు గోదాముల్లో ఉన్న సరుకులను బయటకు తీయాలని, తక్కువ ధరలకు పేదలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో గోదాముల్లో ఉన్న సరకులను పేదలకు పంచుతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకుడు మీసం లక్ష్మణ్, మహిళలు పాల్గొన్నారు.

రూ. 80 లక్షలతో పరారైన మహిళ

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన బాధితులు

కోనరావుపేట, సెప్టెంబరు 29 : గ్రామస్థులను నమ్మించి రూ.80 లక్షలు అప్పుగా తీసుకొని ఓ మహిళ పరారైన సంఘటన కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు న్యాయం చేయాలంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బాధితుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం వెంకట్రావుపేటలో స్వాతి కొన్ని సంవత్సరాలుగా బిల్డింగును కట్టుకొని కిరాణా షాపు నిర్వహిస్తోంది. మొదటగా కొంతమంది గ్రామస్థుల దగ్గర అప్పుగా తీసుకొని తిరిగి వారికి చెల్లించింది. ఇది నమ్మిన గ్రామస్థులు ఆమెకు 80 లక్షల రూపాయల వరకు అప్పుగా ఇచ్చారు. అప్పుగా తీసుకున్న స్వాతి 15 రోజులుగా కనిపించడం లేదు. బిల్డింగును ఒక వ్యక్తికి అమ్మి అతని వద్ద నుంచి డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేసింది. ఇదంతా ఎవరికి తెలియకుండా చేసి 80 లక్షలతో పరార్ అయ్యింది. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ని కలిసి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ న్యాయం చేస్తానని బాధితులకు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జిల్లా నాయకులు నాలుక సత్యం, పల్లె మంజుల రవీందర్ రెడ్డి, జెర్రీగ వెంకటేశం, వేణు, విద్యాసాగర్, మల్లేశం, నరేష్, పల్లం లింగయ్య, ప్రశాంత్, విజయ్, రాకేష్, ప్రభాకర్, కిషోర్ తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

చందుర్తి, సెప్టెంబరు 29: చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఏఎస్ఐ బాపు కథనం ప్రకారం.. మండలంలోని మరిగడ్డ గ్రామానికి చెందిన నేతికుంట శ్రీనివాస్ తన ద్విచక్ర వాహనంపై మూడపల్లిలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లాడు. ఆలయంలో పూజలు చేసుకుని తిరిగి వచ్చేసరికి ద్విచక్ర వాహనం కనిపించకుండా పోయింది. బాధితుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల భూ కబ్జాలు బయటకు తీస్తాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 29: బీఆర్ఎస్ నాయకుల భూ కబ్జాల బాగోతం త్వరలో బయటపెడుతామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ హెచ్చరించారు. ఆదివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమకారుడు కేకే మహేందర్‌రెడ్డిపై నిందలు వేస్తే ఊరుకోబోమన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయం చేసింది బీఆర్ఎస్ నాయకులేనని విమర్శించారు. పద్మశాలీలకు రావాల్సిన రూ.250 కోట్లు విడుదల చేయకుండా ఎన్నికల్లో ఓట్లు దండుకోవాలని చూశారన్నారు. కేకే మహేందర్‌రెడ్డి మాటలను వక్రీకరించి బద్నాం చేయాలని చూస్తున్నారన్నారు. అవాకులు చెవాకులు పేలుతున్న ఓ బీఆర్ఎస్ నాయకుడి బెదిరింపు దందాలు నాటకాలు సిరిసిల్ల ప్రజలందరికీ తెలుసన్నారు. గతంలో మహిళా స్వశక్తి సంఘాలకు కేటాయించిన రేషన్ షాపులు బీఆర్ఎస్ నాయకులు స్వాహ చేసిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా రేషన్ డీలర్ల నియామకం చేపట్టిందన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, నాయకులు భైరినేని రాము, కటకం రాజశేఖర్, గుగ్గిళ్ల శ్రీకాంత్, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, పర్శరామ్, తిరుపతిరెడ్డి, గుగ్గిళ్ల రాములు, ఆరెపెల్లి బాలు, గంగు కొండయ్య కొత్త రవి, మునిగెల రాజు, కిషన్ చందు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి

చందుర్తి, సెప్టెంబరు 29 : గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని జిల్లా పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు మల్యాల నర్సయ్య అన్నారు. మండలంలోని బండపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పంచాయతీ కార్మికుడు రామస్వామిని ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనిచేస్తున్న నిరుపేద పంచాయతీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పంచాయతీ కార్మికులకు బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలన్నారు. మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, నర్సయ్య, రాములు, లక్ష్మి పాల్గొన్నారు.

కార్మికుల తొలగింపు ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 29 : అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో కార్మికుల తొలగింపును ప్రభుత్వం వెంటనే ఆపాలని ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్య కార్మికుల సంఘం జిల్లా కన్వీనర్ మీసం లక్ష్మణ్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం ఏఐటీయూసీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల పారిశుధ్య కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఒకే రకమైన వేతాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రతను కల్పించాలని, పెనాయిల్, బ్లీచింగ్ పౌడర్, మాస్కులు, సేఫ్టీ గ్లౌజులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను గుర్తించి బీమా సౌకర్యం కల్పించాలని, మండల విద్యాధికారితో గుర్తింపు కార్డులు, డ్రెస్ కోడ్ అమలు చేయాలని అన్నారు. పనికి సమానంగా వేతనాలు, ప్రతీ నెల 5వ తేదీలోగా జీతాలు ఇవ్వాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.4 లక్షలు చెల్లించాలని, 60 సంవత్సరాలు దాటిన కార్మికులకు ప్రభుత్వం ప్రతీనెల రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో కార్మికులు దండి లక్ష్మి, శోభ, మల్లవ్వ, నరసవ్వ, రేణుక, శ్యామల, తేజశ్రీ, సుశీల, వనజ, శంకర్, లచ్చవ్వ, రజిత పాల్గొన్నారు.

హోటల్ గంగమ్మ మృతి

వేములవాడ, సెప్టెంబర్ 29 : వేములవాడ పట్టణ ప్రజలకు హోటల్ గంగమ్మగా సుపరిచితురాలైన వడ్లకొండ గంగమ్మ (92) శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. 1970 ప్రాంతంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట చాయ్ మిర్చి హోటల్‌ను ప్రారంభించిన గంగమ్మ ఆ తర్వాత తన హోటల్‌ను ప్రస్తుత ప్రభుత్వ జూనియర్ కళాశాల పడమర వైపు గల చెక్కపల్లి రోడ్డులోని తన సొంత స్థలంలోకి మార్చారు. ఆ సమయంలో గంగమ్మ హోటల్ చాయ్, మిర్చికి ఫేమస్ కావడంతో పాఠశాల, కళాశాల విద్యార్థులు బోధన సిబ్బంది చాయ్ కోసం మిర్చీల కోసం అదే హోటల్ కి వెళ్లేవారు. సుమారు 54 సంవత్సరాలపాటు హోటల్ నిర్వహిస్తూ హోటల్ గంగమ్మగా పేరు తెచ్చుకున్న ఆమె కొద్ది రోజులుగా వయోభారంతో అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో గంగమ్మ శనివారం రాత్రి మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, పిట్టల వెంకటేశం, కర్ల శేఖర్, ప్రేమ్ చారీ, పండుగ రాజు, పోచెట్టి, లాల నర్సింగం, శ్రీకాంత్, కనకరాజు, రవి, రమేశ్, శ్రీనివాస్, మహేశ్, దేవయ్య సంతాపం తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట, సెప్టెంబరు 29 : కోనరావుపేట మండలం సుద్దాలలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, పెరల్స్ ఆర్ట్‌క్రియేషన్స్ సుంకరి శరత్ కుమార్ నిర్వహించే బతుకమ్మ బోనాల కోలాటం శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆదివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ బోనాల కోలాటాల శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రాచీన కళలను ప్రోత్సహిస్తున్న సుంకరి శరత్‌ను అభినందించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, సుద్దాల మాజీ సర్పంచ్ కచ్చకాయల బాల్ రెడ్డి, బొడ్డు రాములు, ప్రజాప్రతినిధులు బుర్ర రమేష్, బాదవేణి కనక సిద్ధిరాములు, బొడ్డు రమేష్, అవురం సురేష్ ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శ

కోనరావుపేట, సెప్టెంబరు 29: కోనరావుపేట మండలం సుద్దాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రామోజీ విష్ణు మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు పరామర్శించారు. సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, ప్యాక్స్ చైర్మన్ రామ్మోహన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, ప్రజాప్రతినిధులు కాశవేణి మహేష్, గోపు పర్శరాములు, వంగాల శ్రీనివాస్, సుమన్, అనిల్, మహేష్, రవి, అంజయ్య, నాగరాజు, అంజనేయులు, కాంతయ్య, అన్వేష్, దిలీప్, దావీదు, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

చందుర్తి: చందుర్తి మండలం లింగంపేటలో ఇటీవల మృతి చెందిన గంగరాజం కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, సింగిల్ విండో చైర్మన్ జలగం కిషన్ రావు, నాయకులు చిలుక పెంటయ్య, దప్పుల అశోక్, రమేష్ రావు, ఆకుల ఎల్లయ్య, రవి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పాలనలో దోపిడీ



మాట్లాడుతున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 29 : బీఆర్ఎస్ పాలనలో దోపిడీ జరిగిందని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆరోపించారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కేవలం తొమ్మిది నెలలు అవుతోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమ పథకాల అమలు కోసం ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలోని మంత్రులు, కొంత మంది చిల్లర నాయకులు తొమ్మిదిన్నర సంవత్సరాల కాలంలో సిరిసిల్లను సర్వనాశనం చేశారని విమర్శించారు. దీనిపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేకే మహేందర్‌రెడ్డి అవసరం లేదని, తామే సమాధానం చెబుతామని అన్నారు. కాంగ్రెస్ తొమ్మిది నెలల్లో చేసిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలని, బీఆర్ఎస్ తొమ్మిదన్నరేళ్లలో చేసిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడదల చేయడానికి సిద్ధమని అన్నారు. 2014కు ముందు మీ ఆస్తులు ఎంత ఇప్పుడున్న మీ ఆస్తులు ఎంతో ముందుగా పేర్కొనాలని డిమాండ్ చేశారు. పదేళ్లఓ ఫోన్ ట్యాపరింగ్‌లతోపాటు, ప్రాజెక్టుల నిర్మాణాలు, సహజ వనరులను దోచుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడు వచ్చి నీతి వ్యాఖ్యలు చెబితే నమ్మె పరిస్థితులలో ప్రజలు లేరన్నారు. ఎన్నికల సమయంలో సిరిసిల్లలో వారానికి రెండు రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానన్న కేటీఆర్ ఎక్కడని ప్రశ్నించారు. భారీ వర్షాలతో సిరిసిల్లలో వరదలు వచ్చి మునిగిపోతే ఎమ్మెల్యే ఎక్కడున్నాడో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. ఎన్నికలలో ఓడిపోయిన కేకే మహేందర్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. మొన్నటి వర్షాల్లో సిరిసిల్ల వరదలతో మునిగిపోతే కేకే మహేందర్‌రెడ్డి స్థానికంగా ఉండి ప్రజలకు సేవలను అందించారన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న కేకే మహేందర్‌రెడ్డిని విమర్శించిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పైనా, కేకే మహేందర్‌రెడ్డిపైనా దగులుబాజీ మాటాలు మాట్లాడడం పిచ్చి కూతలు కూయడం మానుకోవాలని హెచ్చరించారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు గడీల వద్ద కుక్కల్లా మొరుగుతున్నారని, సిరిసిల్లలోని సహజ వనరులను ఏవిధంగా దోచుకున్నారో ఇక్కడి ప్రజలు చూశారని, బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, కౌన్సిలర్లు కుడికాల రవికుమార్, వేముల రవి, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, రాగుల జగన్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు అన్నల్‌దాస్ భాను, గుండ్లపెల్లి గౌతమ్, వంతడుపుల రవి పాల్గొన్నారు.

అంధకారంలో ఎస్సీ కాలనీ

వీర్నపల్లి, సెప్టెంబరు 29: వీర్నపల్లి మండలం గర్జనపల్లి ఎస్సీ కాలనీలో కరెంట్ అధికారుల నిర్లక్ష్యంతో ఆదివారం రాత్రి అంధకారం నెలకొంది. బకాయిలు ఉన్నారంటూ కరెంట్ అధికారులు విద్యుత్ నిలిపివేశారు. గతంలో అధికారుల తప్పిదంతో రీడింగులు తప్పుగా నమోదు చేశారంటూ ఎస్సీ కాలనీవాసులు నిరసన చేపట్టారు. ఇదే విషయంపై విద్యుత్ శాఖ ఏడీని ఫోన్‌లో సంప్రదిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ మండిపడ్డారు. ఎస్సీ కాలనీవాసులను చిన్న చూపు చూసి మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. ఈ విషయంపై అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ అధికారులు బకాయిలు చెల్లించేందుకు సమయం ఇవ్వాలన్నారు. విద్యుత్ కనెక్షన్ తొలగించవద్దని వేడుకున్నా సిబ్బంది కాలనీవాసుల మాట వినలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

అనాథ పిల్లలకు చేయూత

ముస్తాబాద్, సెప్టెంబరు 29: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన చిట్నేని వెంకటేశ్వర్‌రావు దంపతులు పేద పిల్లలకు ఆదివారం చేయూత అందించారు. సేవాలాల్ తండాకు చెందిన రమావత్ అభినాయ్ తల్లి చనిపోగా రూ.10 వేలు ఎస్బీఐలో డిపాజిట్ చేశారు. అదే గ్రామానికి చెందిన అనాథ చిన్నారి హర్షవర్ధన్ ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.